క్లుప్తంగా

ఏవో బాధ్యతల స్వీకారం


ఏవో అప్పారావు

మాకవరపాలెం : వ్యవసాయ అధికారిగా డి.అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న ఏవో చిరంజీవిని రోలుగుంట మండలానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో నర్సీపట్నంలో పనిచేస్తున్న ఏవో అప్పారావును నియమించారు. ఈ నేపథ్యంలో సోమవారం బాధ్యతలు స్వీకరించిన అప్పారావును మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బదిలీపై వెళ్లిన చిరంజీవికి ఘన వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శేషునాయుడు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


కొరువాడ జగన్నాథపురంలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా నివాసితులు శుభ్రంగా ఉంచుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల అన్నారు. కొరువాడ జగన్నాథపురం గ్రామంలో సోమవారం మలేరియా నివారణ మాసోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీని ఆమె వైద్య సిబ్బందితో కలిసి నిర్వహించారు. పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, ఖాళీ గోలాలలో ఉండే నిల్వ నీటిని ఎప్పటి కప్పుడు తొలగించుకోవాలని సూచించారు. ఈ నిల్వ నీటిలో దోమలు లార్వాను విడల్చడం వల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాలు వ్యాపిస్తాయన్నరు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని కోరారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు ఇవ్వాలి


పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్న అంగన్‌వాడీలు

నర్సీపట్నం : అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయు ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రతినిధులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగమే అయినా గౌరవ వేతనం ఇస్తున్నారని, గౌరవ వేతనం పేరుతో సంక్షేమ పథకాల్లో కోత విధించడం సరికాదని అన్నారు. అంగన్‌వాడీలు చాలీ చాలని వేతనాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే సంక్షేమ పథకాలను అమలు చేయాలని లేని పక్షంలో కనీస వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షులు మహలక్ష్మి, ఆర్.రమణమ్మ, వెంకటలక్ష్మి, నాగమణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ

నాతవరం : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు బొంతు రమణ అన్నారు. ఆయన సోమవారం నాతవరంలో విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి రావడం కోసం అలవి కాని హామీలిచ్చి టీడీపీ, జనసేన పార్టీలు ప్రజలను నమ్మించి మోసం చేసినట్టుగా పాలన కనిపిస్తుందన్నారు. గత ప్రభుత్వాన్ని విమర్శించి అభివృద్ధి పనులకు బిల్లులు పెండింగ్ లేకుండా వేసేస్తామని చెప్పి ప్రస్తుతం ఆరు నెలలుగా చేసిన పనులకు బిల్లులు చెల్లింపులు చేయలేదని విమర్శించారు. ఉపాధి హామీ పథకంలో పని చేసిన కూలీలకు సైతం సకాలంలో కూలి డబ్బులు ఇవ్వలేదన్నారు. భర్త చనిపోతే భార్య పేరున ఆరు నెలలు తర్వాత పింఛన్లు మంజూరు చేసినా ఈ నెలలో నియోజకవర్గంలో డబ్బులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారన్నారు. తల్లికి వందనం పథకంలో కొత్తగా నిబంధనలు పెట్టి చాలామందికి రాకుండా చేశారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం కంటే రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడంపైనే కూటమి నేతలు పూర్తిగా దృష్టి సారించారన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ఆలయ నిర్మాణానికి అనకాపల్లికి చెందిన బుద్ద వినీల్‌కుమార్ రూ.30 వేలు విరాళంగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, ఆడారి కాశీబాబు, కోనపల్లి రామ్మోహనరావు, బొడ్డేడ రామునాయుడు, వెలగా శ్రీనివాసరావు, కాండ్రేగుల జగ్గారావు, ఆడారి శ్రీకాంత్, ఆడారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

విత్తనాలు ఎప్పుడిస్తారో...?


వరి విత్తనాల కోసం ఎదురుచూస్తున్న నారుమడి

- దిగులు చెందుతున్న రైతులు
- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా విత్తనాలు ఇవ్వని కూటమి ప్రభుత్వం
- జిల్లాలోనే అధిక విస్తీర్ణంలో నాతవరం మండలంలో వరి సాగు

నాతవరం : ఖరీఫ్ సాగుకు వరి విత్తనాలు ఎప్పుడిస్తారంటూ రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలోనే ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు నాతవరం మండలంలోనే అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. తాండవ రిజర్వాయరు ఉండడంతో ఇతర మండలాల కంటే నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గాలు మండలాలు పరిధిలో ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగు చేసేందుకు నీటి సదుపాయం ఉండడంతో రైతులు ఖచ్చితంగా వరి పంట వేస్తుంటారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు బాగుండడంతో మందు వేసవిలో సైతం వర్షాలు కురియడంతో రైతులు ముందుగానే మే నెలలో వరి విత్తనాలు వేసేందుకు నారుమడులు సిద్ధం చేసుకున్నారు.

ఖరీఫ్ సీజన్ ప్రారభమైనా కూటమి ప్రభుత్వం వరి విత్తనాలు పంపిణీ చేయకుండా జాప్యం చేస్తుంది. వాతావరణం బాగుంది.. తాండవ రిజర్వాయరులో నీటి నిల్వలు బాగున్నాయి.. సకాలంలో వరి విత్తనాలు పంపిణీ చేస్తే నారుమడులు వేసుకుందామని రైతులు రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర విత్తనాలు ముందుగా ఇవ్వకుండా ఆలస్యం చేయడం వల్ల ఆఖరువులో సరిపడా విత్తనాలు అందకపోతే రైతులు మళ్లీ ప్రవేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1700 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదనలు

నాతవరం మండలంలో ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో 25వేల నుంచి 30వేల ఎకరాల మధ్య వరి పంట సాగు చేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకున్నారు. వ్యవసాయాధికారులు మాత్రం ఈ ఏడాది వివిధ రకాల విత్తనాలు కేవలం 1700 క్వింటాళ్లు సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. అవి కూడా ఎప్పుడిస్తారనేది నేటికీ సరైన సమాచారం అధికారులు వద్ద లేదు. రైతులు ప్రతి రోజు రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లడం.. విత్తనాలు ఎపుడిస్తారని అడిగి తిరిగి పోవడం జరుగుతుందని రైతులు వారి బాధలు చెబుతున్నారు. కూటమి నేతలు, అధికారులు స్పందించి విత్తనాలు అందించాలని రైతులు కోరుతున్నారు. గతంలో రైతులకు పెట్టుబడి సాయం కింద మే నేలలోనే డబ్బులు అకౌంట్లలో వేసేవారని, ఇప్పుడు పెట్టుబడి సాయం లేదు, వరి విత్తనాలు ఇంతవరకు ఇవ్వలేదని రైతులు దిగాలు చెందుతున్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

కె.కోటపాడు తహసీల్దార్ భుజంగరావు


తహసీల్దార్ భుజంగరావుకు అభినందనలు తెలుపుతున్న డీఈ రమేష్, రామకాసు తదితరులు

కె.కోటపాడు : రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.భుజంగరావు అన్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ములగాల తహసీల్దార్‌గా పని చేస్తున్న భుజంగరావును కె.కోటపాడుకు బదిలీ చేశారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్‌బాబు, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు పూడి సురేష్, మండల అధ్యక్షుడు అనంత్, గౌరీశంకర్, పూడి శేషగిరి, మండల సర్వేయర్ అనంత్ తదితరులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


పశువైద్యాధికారి నాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

చౌడువాడ పశువైద్యాధికారిగా నాయుడు

చౌడువాడ పశువైద్యాధికారిగా సిహెచ్.వై.నాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చౌడువాడ పశువైద్య కేంద్రంలో పశువైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందంచి శుభాకాంక్షలు తెలిపారు. పాడి రైతులకు సకాలంలో పశు ఆరోగ్యంపై జాగ్రత్తలను వివరించడంతో పాటు పశువైద్యం అందించనున్నట్లు పశువైద్యాధికారి నాయుడు అన్నారు.

నేడు కె.జె.పురంలో పరిదేశమ్మ పండగ

మాడుగుల రూరల్ : మండలంలో కె.జె.పురం గ్రామములో పరిదేశమ్మ పండగ మంగళవారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తుల సందర్శనకు తగు సదుపాయాలు ఏర్పాటు చేశారు.

దేవాలయాల నడుమ మాంసం దుకాణమా?


దేవాలయాల మధ్య మాంసం దుకాణాల వద్ద కిటకిటలాడుతున్న జనం

రావికమతం : పవిత్ర దేవాలయాల మధ్య ఉన్న మాంసం దుకాణాలను మార్కెటు యార్డుకు తరలించాలని పలువురు కోరుతున్నారు. మార్కెటు యార్డు సమీపంలోనే శిరిడి సాయిబాబా, రాంబాయమ్మ, వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయాలు, పక్కనే గ్రంథాలయం ఉన్నాయి. అయితే వాటి నడుమన మాంసం దుకాణాలు నడపడం వల్ల దైవ సాన్నిధ్యం వద్ద ప్రశాంతత కొరవడిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని సుమారు మూడు కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డులోకి ఈ దుకాణాలను మార్పు చేయాలని కోరుతున్నారు. దేవాలయాల సమీపంలోనే మాంసం వ్యర్థాలు వేయడం, ఇక్కడ నుంచి భక్తులకు దుర్వాసన వ్యాపించడంతో సమస్యను ఈవో జగదీశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని చెబుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

దారి తప్పిన కూటమి పాలన

- జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం
- హామీల అమలు కోసం ప్రజల పక్షాన పోరాడుతాం
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్


జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్, పార్టీ నాయకులు

నర్సీపట్నం : జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం.. అనే విషయం రాష్ట్ర ప్రజలకు అర్థమైందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే గణేష్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్న ప్రతిపక్ష నాయకులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సరికాదన్నారు. ప్రభుత్వ పాలన పూర్తిగా గాడి తప్పిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా సూపర్ సిక్స్ హామీల అమలు నత్తనడకన సాగుతోందన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని పాలకులు తుంగలో తొక్కారని మండిపడ్డారు. రూ.3 వేల నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ కింద రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఊసేలేదన్నారు. 19 నుంచి 50 ఏళ్ల వయసున్న ప్రతి మహిళకూ నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు అందజేసే పథకమూ అమలుకు నోచుకోలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఊసే లేదన్నారు. తల్లికి వందనం పేరుతో రూ.10 వేల కోట్లు ఇచ్చామంటూ చెబుతున్న ప్రభుత్వ పెద్దలు ఈ ఏడాది రూ.15,500 కోట్ల విద్యుత్ ఛార్జీల భారాన్ని ప్రజల నెత్తిన మోపిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ఏదీ అని ప్రశ్నిస్తే నాలుక మడత పెడతామన్న సీఎం చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబు ఏడాది పాలన అంతా మోసాలు, ఆరాచకాలే కనిపిస్తున్నాయన్నారు. హామీలు అమలు చేసేంత వరకు సీఎం చంద్రబాబుకు నిద్ర లేకుండా చేస్తామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతూ భయానక వాతావరణం కల్పిస్తున్నారన్నారు.

గ్రామ కమిటీలు

పార్టీ గ్రామ కమిటీ ఎన్నికల ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పార్టీ నాయకులకు సూచించారు. ఆయా పంచాయతీలకు నియమించిన ఇన్‌ఛార్జిలు కమిటీలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల సన్యాసిపాత్రుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, టౌన్ పార్టీ అధ్యక్షులు ఏకా శివ, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు శానపతి వెంకటరత్నం, లెక్కల సత్యనారాయణ, లగుడు నాగేశ్వరరావు, చిటికెల రమణ, ఎంపీపీ సాగిన లక్ష్మణ్‌మూర్తి, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, కర్రి శ్రీనువాసరావు, చెరుకూరి సత్యనారాయణ, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, టౌన్ మహిళా అధ్యక్షురాలు కణితి అన్నపూర్ణ, గంటా లలిత, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు


దేవరాపల్లిలో లైసెన్స్ వరి విత్తనాల దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: లైసెన్స్ దుకాణాలలో ఖరీఫ్ వరి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ హెచ్చరించారు. మండల కేంద్రంలోని హేమ రైతు డిపో, మన గ్రోమోర్ లైసెన్స్ విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల షాపులను సోమవారం ఆమె అకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాలలో స్టాక్ రిజిస్టర్లను, నిల్వలను తనిఖీ చేశారు. దుకాణాల ఎదుట రైతులకు తెలిసే విధంగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసే ప్రతీ రైతుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణ యజమానులకు సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు బస్తా మొత్తం తెరవకుండా రంధ్రం చేసి 100 గింజలను తీసి మొలక శాతం కట్టాలని సూచించారు.

ఖరీఫ్ వరి విత్తనాలు పంపిణీ నేడు...

ఖరీఫ్ వరి విత్తనాలను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ చేతులు మీదుగా మంగళవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో పంపిణీ చేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి కాంతమ్మ తెలిపారు.

చదువుతోనే ఉన్నత ఉద్యోగ అవకాశాలు


ఎ.కోడూరు హైస్కూల్లో పుస్తకాలు అందజేస్తున్న సర్పంచ్ అక్కునాయుడు, హెచ్ఎం శేఖర్

కె.కోటపాడు : ప్రతి విద్యార్థి చదువుల్లో ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎ.కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, ఎంపీటీసీ లెక్కల గౌతమి సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాంను సోమవారం పంపిణీ చేశారు. పాఠశాలలో 1 నుంచి 10వ తరగతి వరకూ చదువులు సాగిస్తున్న 402 మంది విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.శేఖర్, మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు, పీఎంసీ కమిటీ చైర్మన్ కిల్లి సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ


తెనుగుపూడిలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న హెచ్ఎం ప్రసాద్ తదితరులు

దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను స్థానిక ప్రధానోపాధ్యాయుడు డి.ఎస్.ఎస్.వి. ప్రసాద్, విద్యా కమిటీ చైర్మన్ అల్లం కాసులమ్మ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. స్థానిక హైస్కూల్లోని మూడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు ఈ కిట్లు అందజేస్తున్నట్టు హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెదనాయుడు, మాజీ ఎంపీటీసీ అప్పలనాయుడు, ఆంగ్ల ఉపాధ్యాయుడు వెంకటరమణ పాల్గొన్నారు.

మండల వ్యవసాయాధికారిగా చిరంజీవి



రోలుగుంట: సిబ్బందిని రైతులకు అందుబాటులో ఉంచి వ్యవసాయ సాగు సంబంధిత విషయాలపై అవగాహన కల్పిస్తానని రోలుగుంట మండల వ్యవసాయాధికారిగా విధుల్లో చేరిన సిహెచ్.చిరంజీవి తెలిపారు. ఇప్పటి వరకూ ఆయన గత ఆరు సంవత్సరాలుగా నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెంలో పని చేసి, ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు బదిలీ అయి ఈ నెల 13 న విధుల్లో చేరారు. ఇక్కడ పని చేసిన ఎస్.విజయలక్ష్మి నర్సీపట్నం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి చిరంజీవి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందించి రైతులకు న్యాయం జరిగేలా చేస్తానన్నారు. అలాగే సిబ్బందిని రైతులకు అందుబాటులో ఉంచి నేను పని చేస్తూ వారితో కూడా పని చేయించి తమ సేవలు విస్తృత పరుస్తానని సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వివరించారు.

నేడు పీడీపాలెంలో వైద్య శిబిరం


బుచ్చెయ్యపేట : పొట్టిదొరపాలెంలో గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు వి.ఎస్.ఆర్ ట్రస్ట్ నిర్వాహకుడు వివిఎస్ ఆర్ ట్రస్ట్ నిర్వాహకుడు వడ్డి సత్యారావు తెలిపారు. గ్రామదేవత నల్లమారమ్మ పండగ సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశామని విశాఖ ఎస్ఆర్ఐ ఆసుపత్రి వైద్యులు పాల్గొని ఉచితంగా వైద్య సేవలు, మందులు అందిస్తారన్నారు. వైద్యులతో గుండె పోటుపై అవగాహన కల్పించి ఈసీజీ తీస్తారన్నారు. ఈకో, టూడీ, కంటి వైద్య పరీక్షలు, జనరల్ పరీక్షలు చేసి మందులు అందిస్తారన్నారు.

మేడివాడ విద్యుత్ సమస్యలపై డీఈకి ఫిర్యాదు


మేడివాడలో విద్యుత్ సమస్యలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్న దృశ్యం

రావికమతం : మేడివాడ గ్రామంలో విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, ప్రధానంగా లోఓల్టేజ్ సమస్య అధికంగా వుందని, దీని నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు నర్సీపట్నం విద్యుత్ ఏఈ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. వారం రోజులు గడిచినా అధికారులు స్పందించకపోవడంతో గ్రామస్తులతో కలిసి సర్పంచ్ సోమవారం సంబంధిత డీఈకి ఫిర్యాదు చేశారు. గ్రామంలో లోఓల్టేజ్ సమస్య అధికంగా ఉందని, తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, రాత్రి సమయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఈ మేరకు డీఈ వారికి హామీ ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు వడ్డాది విద్యుత్‌శాఖ ఏడీఈ సురేష్ బాబు మేడివాడ గ్రామాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకున్నారు. తోకలవారి వీధిలో వున్న విద్యుత్ వైర్లు తగులుతున్నాయని, లోఓల్టేజ్ నివారణకు కుంచంగి వారి వీధి మార్గంలో విద్యుత్ స్తంభాలు వేయాలని, దీనికి గ్రామస్తులు సహకరించాలని వారు కోరారు.

మామిడిలో అంతర పంటగా నువ్వు పంట


కె.కె.అగ్రహారంలో అంతర పంటగా సాగులో నువ్వు పంట

కె.కోటపాడు : అంతర పంటల సాగు విధానంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో మామిడి పంటలను సాగుచేస్తున్న మెట్ట ప్రాంత గ్రామాల్లో రైతులు అంతర పంటల విధానంలో పంటలను సాగు చేస్తున్నారు. అంతర పంటలను ప్రధానంగా మొక్కదశలో ఉన్న మామిడి తోటల గల మధ్య గల ఖాళీలో వేస్తున్నారు. కె.కె.అగ్రహారం, పాతవలస, మర్రివలస, కె.కె.అగ్రహారం గ్రామాల్లో ప్రస్తుతం మామిడిలో అంతర పంటగా నువ్వు పంటను సాగు చేస్తున్నారు. అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చునని సాగు రైతులు తెలుపుతున్నారు. సాగులో ఉన్న నువ్వు పంట కోతదశకు చేరుకుంది.

ఆరుతడి పంటలపై రైతుల ఆసక్తి

రోలుగుంట : తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే ఆరుతడి పంటలపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రైతులు పంట భూముల్లో దుక్కులు చేసుకుని పెసలు, మినుములు, నువ్వు లు విస్తారంగా వేశారు. వాతావరణం అనుకూలించడంతో నువ్వులు, పెసలు గింజకట్టాయి. కుంచం రూ.300 ధర పలకడంతో పెట్టుబడులు పోను ఆదాయం బాగుంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉపఖజానా కార్యాలయంలో నిలిచిన సేవలు

- పిడుగు పడి ఐదు రోజులుగా పనిచేయని కంప్యూటర్లు, ప్రింటర్లు
- వివిధ పనుల కోసం కక్షిదారుల ప్రదక్షిణలు


ఉపఖజానా కార్యాలయంలో పనిచేయని కంప్యూటర్లు,ప్రింటర్లు


యలమంచిలి ఉప ఖజానా కార్యాలయం

యలమంచిలి రూరల్: యలమంచిలి ఉప ఖజానా కార్యాలయంలో ఐదు రోజులుగా కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయడం లేదు. దీంతో ఈ కార్యాలయం ద్వారా ప్రాసెస్ కావాల్సిన బిల్లులకు చిక్కులు తప్పడం లేదు. ఈ నెల 9న యలమంచిలి పట్టణంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో స్థానిక ఉపఖజానా కార్యాలయం సమీపంలో పిడుగులు పడ్డాయి. దీంతో కార్యాలయంలో మొత్తం కంప్యూటర్లు, ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ డివైస్‌లు, కొన్ని విద్యుత్ వైర్లు కాలిపోయాయి. అప్పటి నుంచి ఇక్కడ సేవలన్నీ స్తంభించిపోయాయి. యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలకు సంబంధించిన 2 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు, 1200 మంది పెన్షనర్లు, మరికొన్ని శాఖల అధికారుల జీతభత్యాలు, వసతి గృహాలు, గ్రామ పంచాయతీలు, మండల పరిషత్ సహా ప్రభుత్వ నిధుల వ్యయానికి సంబంధించిన సుమారు 1000కి పైగా బిల్లులన్నీ ఇక్కడ ఉపఖజానా కార్యాలయం ద్వారానే ఆమోదం పొందాల్సి ఉండగా.. 50కి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. సేవలు స్తంభించిపోవడంతో వివిధ పనులపై వస్తున్న పెన్షనర్లు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉపఖజానాధికారి, మరో ఉద్యోగి తమ సొంత ల్యాప్‌టాప్‌లు తెచ్చి పలు అత్యవసర పనులు పూర్తి చేస్తున్నారు. మిగతా సిబ్బందికి పనిలేకపోవడంతో ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా కార్యాలయంలో సేవలు యథాతథంగా అందించేలా చర్యలు తీసుకోవాల్సిన ఖజానాశాఖాధికారులు నిర్ల క్ష్యం చూపుతున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు. దీని పై యలమంచిలి ఉప ఖజానాధికారి టి.ఉదయభాస్కరరావును సంప్రదించగా పిడుగు పడడంతో కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర వస్తువులు పాడైనమాట వాస్తవమేనన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. కక్షిదారులకు ఇబ్బందులు లేకుండా త్వరలోనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు.

అనకాపల్లిలో ఆధార్ కష్టాలు



రోజుకు 30 మందికి మాత్రమే సేవలు ఉంటాయని తెలియజేస్తున్న బోర్డు

అనకాపల్లి టౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్ అనుసంధానం తప్పనిసరైంది. ఆధార్ కార్డుల్లో పేరు, అడ్రస్, ఫోన్ నెంబర్ మార్పులు, చేర్పులు, బయోమెట్రిక్, నూతన కార్డుల కోసం ప్రజలు నిరంతరం ఆధార్ కేంద్రాలకు వస్తున్నారు. పట్టణంలోని మెయిన్‌రోడ్ యూనియన్ బ్యాంక్, చోడవరం బస్టాప్ ఎదురుగా ఉన్న ఇండియన్ బ్యాంక్, ఉడ్‌పేట యూనియన్ బ్యాంక్, పోస్ట్ ఆఫీస్ ప్రధాన కేంద్రం, గవరపాలెం పోస్ట్ ఆఫీస్‌లలో ఆధార్ సెంటర్ల వద్ద ప్రజలు గంటలు కొద్దీ వేచి చూడాల్సి వస్తోంది. రోజుకు 30 నుంచి 40 మందికి మాత్రమే టోకెన్లు ఇచ్చి మిగిలిన వారికి రిక్తహస్తం చూపిస్తున్నారు. కొన్నిసార్లు సర్వర్ డౌన్ అని చెప్పడంతో రోజంతా ఉండాల్సి వస్తుంది. సేవలకు ప్రభు త్వం సూచించిన దానికంటే ఎక్కువగా డబ్బులు వసూలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఒక్క బయోమెట్రిక్ సేవ కోసమే రూ.100, మిగిలిన ఏ సేవ అయినా రూ.50 వసూలు చేయాల్సి ఉండగా, ఆయా వ్యక్తుల బట్టి అధికంగా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.